న్యూజెర్సీ కథల పోటీలో రూ. 150/-లు బహుమతి పొందిన కథ

# మాతృత్వం

— జి. లక్ష్మి



ముసురు. దట్టంగా ముసురు. అప్పటికి మూడు రోజుల నుంచీ నిలబెట్టి కురుస్తోంది వాన. ఎవరినీ ఎటూ కదలనివ్వకుండా కాపలా కాస్తోంది వాన. ముసురుతోబాటు దిగబడిన చిన్న కొడుకు ఆ రోజు ఉదయం నుంచీ మబ్బులు పట్టిన ఆకాశంలా వున్నాడు. అటూ ఇటూ తిరుగుతూ పని చేసుకుంటున్న జానకమ్మ ఓ కంట కొడుకుని గమనిస్తూనే వుంది. ఇల్లంతా సందడి చేసే కొడుకు ఎందుకలా వున్నాడో ఆమెకి బోధపడ లేదు.

మధ్యాహ్నం భోజనాలై అందరూ, కూర్చున్న తర్వాత ఉరమ కుండానే పిడుగు పడింది.

"అమ్మా, నిన్ను నాతోపాటు బెజవాడ తీసుకువెళ్దామని వచ్చానే. సుమిత్ర లీవ్ అయిపోయింది. పాపని చూడడానికి నువ్వు రాకపోతే కష్టం అయిపోతుంది" అంటున్న కొడుకు మాటలు అర్థం చేసుకోవ డానికి జానకమ్మకు కొంత టైం పట్టింది. ఒక క్షణం ఏం చెప్పాలో తెలియక కొడుకు వైపు, కూతురి వైపు మార్చి మార్చి చూసింది. కూతురి మొహం మాడిపోవడం ఆమె దృష్టి దాటి పోలేదు.

"ఎలారా! బాబుగాడికి ఇప్పుడేగా ఏడాది నిండుతోంది. వీడిని వదిలేసి ఎలా రానురా" అంది. ఒళ్ళో వున్న మనమడి తల నిమురుతూ. "ఏమో! ఎలాగోలాగ నువ్వు వీలు చూసుకుని రావాలి మరి పెద్దదానివి, నువ్వుంటే మాకు ధైర్యంగా వుంటుంది" నిక్కచ్చిగా చెప్పాడు కొడుకు. కొడుకు అన్న తీరు చూసి జానకమ్మ గుండెల్లో రాయి పడింది. ఏదో ఒక రోజున ఇలాంటి సందర్భం వస్తుందని ఆమె భయపడుతూనే వుంది.

భర్త పోయేటప్పటికి కూతురు ప్రసవించే రోజులు దగ్గర పడ్డాయి. అసలే దాని ఆరోగ్యం అంతంత మాత్రం. చిన్న కొడుకు ఉద్యోగం రావడంతో అన్న నుంచి వేరు పడి బెజవాడ వెళ్ళిపోయాడు. పెద్ద కొడుకు వచ్చి తన దగ్గరే వుండ మన్నాడు. కూతురిని ఆ స్థితిలో వ దలడానికి మనసొప్పక కూతురింట్లోనే వుండిపోయింది. అల్లుడు కూడా పరవాలేదు, మంచివాడే. తనని గౌరవంగా చూస్తాడు. భర్త మనమడి రూపంలో పుట్టాడని మనమడంటే పెంచుకున్న ప్రేమ! కూతురికి ఉద్యోగంలో క్షణం తీరదు. కూతురింట్లోనే తన జీవితం కడతేరి పోవాలని ఆమె మనస్సులో కోరిక.

చిన్న కోడలు అదో తరహా అహంకారం జాస్తి. అందుకే అక్కడికి వెళ్ళడం జానకమ్మకు ఒప్పడం లేదు.

"వీడిని ఎటూ కాకుండా ఎలా వ దిలి రానురా? అవేవో క్రష్‌లో బుష్‌లో చిన్నప్పటి నుంచీ అలవాటయితే ఫరవాలేదు గానీ ఇప్పుడింక వీడిని అక్కడుంచినా వుండడు" అంది. చివరకి మనవడిని ఇంక క బెట్టి.


"అబ్బ అదేదో చెల్లి చూసు కుంటుంది లేమ్మా. ఏడాది పాటు వాడిని పెంచావు కదా. కాస్త మా పరిస్థితి కూడా ఆలోచించవే. నీ కోడలా ఇంట్లో వుండేది కాదు కదా. వాళ్ళ అమ్మకి కూడా ఉద్యోగమే. మాకు మాత్రం నీవు పెద్ద దిక్కుగా ఇంట్లో వుండాలని అనిపించదా" కొడుకు గొంతులో నిష్ఠూరం అందులో నిష్ఠూరం కన్నా అవసరమే ఎక్కువగా ధ్వనించింది. తనేమన్నా పసి పిల్లల్ని చూసే ఆయానా? అని జానకమ్మ కోపం తెచ్చుకోబోయింది. కానీ కొడుకు వాదనలో కొంతైనా నిజం వుందనిపించింది. "ఇప్పుడిలా అర్ధాంతరంగా రమ్మంటే ఎలారా చిన్నన్నయ్యా! ఎవర్నన్నా కాస్త నమ్మక మున్న ఆయాని చూసి మీరే పెట్టు కుంటె సరిపోతుంది కదరా. బాబు గాడు అమ్మని విడిచి క్షణం వుండలేడు" అంటూ కూతురు జోక్యం చేసుకుంది.

"ఓ నెలా, రెండు నెలలపాటు అమ్మను తీసుకెళ్ళి వుంచు కుందామని నేననుకుంటున్నానే. సరోజకు వంట్లో సుస్తీగా వుంటోంది. పిల్లల్ని టైమ్‌కి స్కూల్‌కి అన్నీ సర్ది పంపించేటప్ప టికి నా ప్రాణం పోతోంది. అందుకే వచ్చానసలు" అదే వూళ్ళో వుంటు న్న పెద్ద కొడుకు తనేం తక్కువా అన్నట్టున్నాడు. జానకమ్మ మనసు కలుక్కుమంది. ఏంటి వీళ్ళు తనని ఎదుట వుంచుకునే ఇలా దెబ్బలాడుకుంటు న్నారు. ఒకళ్ళకి పని మనిషి, ఒకళ్ళకి ఆయా, ఇంకొకళ్ళకి పని మనిషి, ఆయా. ఇదే కానీ తను అమ్మనని ఎవరికీ గుర్తున్నట్టనిపించలేదామెకి.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

ఆ రోజు రాత్రి పడుకోబోయే ముందు కూతురి దగ్గర విషయం కదిపింది. కూతురు గట్టిగా పట్టుబడితే ఎప్పటికీ కూతురు దగ్గరే వుందామని ఆమె ఆశ. ఆ ధైర్యంతో కొడుకుకి రావని చెప్పొచ్చని ఆమె ఆలోచన.

"ఏంటే అన్నయ్య అలా అంటున్నాడు. మరి వెళ్ళనా" అడిగింది కూతురిని. "నువ్వెడితే ఎలాగే. ఇప్పటికే ఎంత హడావుడి అవుతోందో చూస్తున్నావుగా నువ్వు" అంది కూతురు "రావని చెబితే వాడికి కోపం వస్తుందేమోనే. ఎప్పటికైనా వాళ్ళ దగ్గరికి పోవలసిన దానివి" అంది. కూతురి అభిప్రాయం తెలుసుకోవడానికన్నట్టు. "అదీ విజమే. రేపు మళ్ళీ నువ్వు వాళ్ళ




దగ్గరికి వెళ్ళాల్సివప్పుడు దెప్పుతారు" అంది కూతురు.

"పోనీ నేను ఎప్పటికీ ఇక్కడే వుండిపోతే అప్పుడు వాడికి రావని చెప్పొచ్చుగా" అంది జానకమ్మ. కూతురి మొహంలో అదొకలాంటి మార్పు బెడ్‌లైట్ వెలుతురులో కూడా స్పష్టంగా కనిపించింద. "అట్లా ఎట్లాగే, నువ్వసలే పెరాలిసిస్ పేషంట్‌వి. మళ్ళీ రేపు నీకేదైనా వచ్చి కాలో చేయి పడిపోతే ఉద్యోగానిక పోయేదాన్ని నిన్ను ఎలా చూసుకోను నేను! రోజంతా నువ్వు అలా పడి వుండాలంటే కష్టం కదా' అంది కూతురు.

ఒక్కసారి కళ్ళ ముందు వెయ్యి మెరుపులు మెరిసినట్టనిపించింది జానకమ్మకు. ఆమె పెదాల మీద విరక్తితో కూడిన నవ్వొకటి కదిలింది. ఎంత దూరం ఆలోచించింది కూతురు! అంటే రేపు తను మంచాన పడితే కూతురికి పనికి రాదన్నమాట. అన్నల దగ్గరికి పంపుతుంది. ఇన్నాళ్ళు ఇక్కడ చేసి మంచాన పడినతర్వాత వెడితే అక్కడ కొడుకులు తన మొహం చూస్తారా? ఇన్నాళ్ళూ తన పిల్లలు తన పిల్లలని ఎంత భ్రమ పడింది తను! పిల్లల కన్నా ఎక్కువా అని ఎన్ని కోరికల్ని సమాధి చేసుకుంది.

ఆ వచ్చే జబ్బేదో ఇప్పుడే వచ్చి తను మంచాన పడితే ఇప్పుడు రమ్మని పోట్లాడుకుంటున్న వారు అప్పుడు వద్దని దెబ్బలాడుకుంటారేమో. అమ్మ, అడవిలో మట్టి అనే పదాల గొప్పతనం ఇదన్నమాట. ఆమె పెదవులపై చిత్రమైన నవ్వు మెరిసింది.

"మరి ఏమంటావే!" అడిగింది కూతురు. "అదీ విజమేలే" అనేసి ఊరుకుంది జానకమ్మ.

ఆ రాత్రి జానకమ్మ పాలిట కాళరాత్రి అయింది. పొడారిన కళ్ళకు నిద్ర కూడా పిల్లలలాగే మొహం చాటేసింది. కాసేపు తన దౌర్భాగ్యాన్ని తిట్టుకుంది. జీవితాంతం తోడుంటానని ప్రమాణం చేసి అర్ధాంతరంగా వదిలేసి పోయిన భర్తని తిట్టుకుంటూ దిగులుగా నిద్రలోకి జారుతున్న జానకమ్మ కళ్ళ ముందు అంతకు ముందు రోజు పేపర్లో చూసిన 'ఆయా కావలెను' ప్రకటన మెరిసింది. ■

* ప్రేమంటే చుంబనం కాదు; ఆలింగనం అంతకన్నా కాదు.

* ఓ అబ్బాయి, ఓ అమ్మాయి- ఒకర్నొకరు తాకకుండా ప్రేమించుకోవడం సాధ్యమా?
అసాధ్యం కాదు అని కాగితం మీద రాసి ఇస్తోంది ఓ విద్యార్థిని.
* సిద్దార్థ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థిని చెబుతున్న ఓ ప్రేమ కథ —
* ఇంటిల్లిపాదీ ఒక చోట కూర్చుని చదివి' చర్చించుకోదగిన సీరియల్ —

● త్వరలో!
అతి త్వరలో!!

టీనేజ్ రీడర్స్ కోసం
ఓ కాలేజీ విద్యార్థిని
రాస్తున్న సీరియల్ ...